

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోటపల్లి, ఆగస్టు 10: మండలంలోని పారుపెల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో శనివారం పేకాట స్థావరంపై కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్ ఆధ్వ ర్యంలో పోలీసులు దాడి చేశారు. అడవిలో రహస్యంగా పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి నలుగురిని పట్టుకున్నామని మరో నలుగురు పరారైనట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 1,34,750 నగదును, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో పేకాడుతున్నట్లు గుర్తిస్తే సమాచారం అందించాలని కోరారు.

రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చు


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 10: రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల రెడ్‌క్రాస్ సొసైటీ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అదనపు కలెక్టర్ సబావత్ మోతి లాల్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో, గర్భిణులకు ప్రసవాల సమయాల్లో రక్తాన్ని అందించడం వల్ల వారి ప్రాణాలను కాపాడిన వారమవుతామని అన్నారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమని చెప్పారు. 191 యూనిట్ల రక్తాన్ని అందించడం అభినందనీయమని అన్నా రు. ఈ నెల 15వ తేదీన తాండూర్ మండలంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, సీఎస్ ఆర్‌ఎంఓ భీష్మ, డీసీఎస్ ఆర్‌ఎంవో శ్రీమన్నారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ కె భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అభినవ సంతోష్, కాసర్ల శ్రీనివాస్, ముల్కల సత్యనారాయణ, శంకర్‌వర్మ, బొద్దినేని సత్యనారాయణ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను విస్మరిస్తే పోరాటం తప్పదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 10: ప్రజా సమస్యలను విస్మరిస్తే పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు పార్టీ జెండాను సీపీఐ సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై విస్మరిస్తే పోరాటం తప్పదని అన్నారు. అర్హులైన రైతుందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు , వాసిరెడ్డి సీతారామయ్య, రామడుగు లక్ష్మణ్, చిప్ప నర్సయ్య, వెంకట స్వామి, చంద్రశేఖర్, శేఖర్, నగేష్, వీరభద్రయ్య, మల్లేష్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో వాటా కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్

దండేపల్లి, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణలో నేతకాని వాటా కోసం ఉద్యమించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ పిలుపునిచ్చారు. దండేపల్లిలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకునేతకాని సమాజానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే, నామినేటెడ్ పోస్టులను ప్రకటించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. చట్టసభల్లో నేతకాని సంఘానికి సముచిత స్థానం కల్పించాలన్నారు. దీని కోసం మనమందరం కలిసి కట్టుగా పోరాడిందేకు రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నేతకాలని నూతన కమిటీలను వెంటనే వేసుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధికారి ప్రతినిధి గోళ్ళ రాజమల్లు, మండల ఇంచార్జీ జాడి ఇస్తాకర్, నాయకులు శేఖర్, గంగన్న, శ్రీనివాస్, రాజలింగు, తిరుపతి, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలకు డబ్బులు ఇవ్వకూడదు

బెల్లంపల్లి, ఆగస్టు 10: విద్యుత్ సేవలు, సమస్యల పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది డబ్బులు అడిగితే సమాచారం అందించాలని విద్యుత్ డీఈఈ రాజన్న అన్నారు. శనివారం విద్యుత్ సేవల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ సేవల విషయంలో లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాల న్నారు. అలాగే విద్యుత్ వాడకం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఏడీఈ రూరల్ రాంచందర్, ఏఈ శ్రీనివాస్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్ము అశోక్ యాదవ్‌కు డాక్టరేట్ ప్రదానం

భీమారం, ఆగస్టు 10: తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ రెండో సారి గౌరవ డాక్టరేట్‌అందుకున్నారు. మాద్రెస్ పాండిచ్చేరి పట్టణంలోని శాన్బాగ్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్లోబల్ అకాడమీ కౌన్సిల్ జర్మని యూనివర్శిటీ వారు అశోక్‌యాదవ్‌కు సామాజిక సేవ సోషల్ సర్వీసులో డాక్టరేట్‌ను అందజేశారు. యూనివర్శిటీ ఛైర్మన్ డాక్టర్ సుబ్బయ్య, సినిమా నిర్మాత అశ్వినిదత్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న కొమ్ము అశోక్ యాదవ్‌ను పలువురు అభినందించారు. అశోక్ యాదవ్ జిల్లాలో పలు సామాజిక సేవ కార్యక్ర మాలు చేపట్టారు.



ఇండస్ట్రియల్ హబ్‌తో ఉద్యోగావకాశాలు

- 292 ఎకరాల్లో ఐటీ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు
- స్థల పరిశీలన చేసిన పరిశ్రమలశాఖ అధికారులు
- వ్యాపారులకు స్థలాలు అప్పగించడమే తరువాయి
- భూములకు పరిహారంపైనే సందేహాలు

మంచిర్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నందున ఉద్యోగావకాశాలు మెరుగుపడనున్నాయి. మండలంలోని 292 ఎకరాల స్థలంలో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తరుచుగా చెబుతూ వస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే భూ సేకరణ పూర్తికాగా, పరిశ్రమలు స్థాపించే వ్యాపారులకు స్థలాలను అప్పగించడమే మిగిలి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా కూడా ఐటీ హబ్ లేకపోగా మంచిర్యాల నియోజకవర్గంలోనే దానికి అంకురార్పణ జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో అర్హతగల స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనుండగా, ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

వేంపల్లి గ్రామ శివారులో..

జిల్లాలోని హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్‌లు 154, 155, 159తో పాటు సమీపంలోని మొత్తం 292 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇండ స్ట్రియల్ హబ్ కోసం వినియోగించనుండగా, ఇటీవల డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ మల్సూర్, టీజీఐఏసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తితోపాటు జిల్లా స్థాయి అధికారులు పరిశీలించి సంసిద్ధత తెలియజేశారు. గతంలో కొంతకాలం ఆ భూముల్లో కొంత భాగం మంచిర్యాల మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం వినియోగించారు. అయితే డంప్‌యార్డు ఏర్పాటు చేసి, మున్సిపల్ చెత్త వేయడం వల్ల అది కుళ్లి దుర్గంధం వ్యాపించే అవకాశం ఉన్నందున గ్రామస్తులు కొందరు అభ్యంతరం తెలిపారు. స్థలం చుట్టూ ప్రహరీ లేకపోవడం మూలంగా వర్షాకాలంలో కుళ్లిన పదార్థాలు సమీపంలోని చెరువుల్లోకి చేరే ప్రమాదం ఉన్నందున డంపింగ్ యార్డును నిలిపివేయాలని కోరుతూ 2016లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు సదరు స్థలంలో చెత్త డంప్‌ను నిలి పివేశారు. ప్రస్తుతం అవే భూముల్లో ఐటీ పార్కుకు అంకురార్పణ జరుగగా, పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వ్యాపారులకు స్థలం అప్పగించడమే మిగిలి ఉంది.

పేదలకు కేటాయించిన ప్రభుత్వం..

సదరు స్థలం గతంలో కొందరు భూమి లేని నిరుపేదలకు సాగు నిమిత్తం ప్రభుత్వం అసైన్డ్ చేసింది. కొంత కాలం పాటు భూమిని సాగుచేసిన లబ్ధిదారులు అనం తరం వదిలివేయడంతో బీడు భూమిగా మారింది. ప్రభు త్వం నుంచి భూములు పొందిన లబ్ధిదారుల పేరిట అసైన్‌మెంట్ చట్టం ప్రకారం ప్రభుత్వం సాగు హక్కులు కల్పించింది. 1977లో అమల్లోకి వచ్చిన అసైన్‌మెంట్ చట్టం ప్రకారం ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన భూములను హక్కుదారులు కేవలం సాగు మాత్రమే చేయాల్సి ఉంది. క్రయ, విక్రయాలు జరిపేందుకు వీలులేదు. ప్రత్యేక పరిస్థితుల్లో విక్రయాలు చేయాలనుకుంటే అసైన్ మెంట్ చట్టం ప్రకారం అర్హతగల వారు మాత్రమే సాగు కోసం కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది. అయితే సదరు భూముల్లో పలువురు లబ్ధిదారులు ఇప్పటికే సాగు చేస్తుండగా, కొంత మొత్తం మాత్రం అన్యాక్రాంతం అయిందనే ఆరోపణలు ఉన్నాయి.

వ్యాపారులతో ముఖాముఖి..

ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కులో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు, వ్యాపారులను ఆహ్వానించే క్రమంలో జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ల నేతృత్వంలో పరిశ్రమలశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు ప్రత్యేక ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే భూసేకరణ జరిగినందున వ్యాపారులు ముందుకు వస్తే భూములు కేటాయిస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యం, రహదారుల ఏర్పాటు, తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారు. కాగా స్థానికంగా ఖనిజ, బొగ్గు వనరులతోపాటు రైల్వే మార్గం అందుబాటులో ఉండటంతో వ్యాపారులకు సౌలభ్యంగా ఉండనుంది. ఈ సందర్భంగా వ్యాపారులను ప్రోత్రహిం చేందుకు అధికారులు అవసరమైన కార్యాచరణ చేపట్టారు. అనుకున్న విధంగా ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్కు ఏర్పాటు చేసిన పక్షంలో ఈ ప్రాంతం ఊహించని విధంగా అభివృద్ధి చెందడంతోపాటు ఇక్కడి భూముల ధరలు సైతం ఆకాశాన్నంటే అవకాశాలు ఉన్నాయి. తద్వారా స్థానిక ప్రజలకు మేలు చేకూర్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.


కలెక్టర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వ్యాపారులు (ఫైల్)

పరిహారం చెల్లింపులే ప్రధానం..

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేయబోయే భూముల లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులే ప్రధానం కానున్నాయి. ప్రభుత్వపరంగా అసైన్‌మెంట్ చట్టం ప్రకారం పట్టాలు పొంది ఉన్నందున ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే లబ్ధిదారులతో గతంలో సమావేశం ఏర్పాటు చేసి ఎకరానికి రూ. 10 లక్షలు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీనికి లబ్ధిదారులు ఒప్పకోవడం లేదు. ప్రస్తుతం భూముల ధర మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ. 6.5 లక్షలు ఉంది. ప్రభుత్వం భూ సేకరణ జరుపుతున్నందున దానికి మూడు రెట్లు చెల్లిం చాలనే నిబంధన ఉంది. ఆ ప్రకారం ఎకరా ఒక్కంటికి రూ. 21 లక్షలు అవుతుందని, ఆ మేరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయం మేరకు ధరల చెల్లింపులు ఆధారపడి ఉండగా, ఆ సమస్య పరిష్కరిస్తేనే ఐటీ పార్కు ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యే అవకా శాలు ఉన్నాయి.

లోతొర్రెపై బ్రిడ్జి నిర్మించాలి

- ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలి
- ఎమ్మెల్యేకు బీజేపీ నాయకుల వినతి


నక్కలపల్లి దారిలో లొత్తొర్రెను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోటపల్లి, ఆగస్టు 10: మండలంలోని నక్కలపల్లి దారిలో ఉన్న లోతొర్రెపై బ్రిడ్జి నిర్మించి గ్రామాల ప్రజలకు రవాణా సౌక ర్యాలు కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ మండల ఉపాధ్య క్షుడు పెద్దింటి పున్నంచంద్,ప్రధాన కార్యదర్శులు కందుల వెంకటేష్, పెద్దింటి లచ్చన్న, నాయకులు శనివారం లోతొర్రె ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా లోతొర్రెపై నిర్మించిన వంతెన కూలిపోయిందన్నారు. 15 రోజుల క్రితం ఈ వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే వివేక్ మరమ్మతులు చేస్తామని చెప్పారని, అయినా ఇప్పటి వరకు చేయ కపోవడం సిగ్గు చేటన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల సోసల్ మీడియా అధ్యక్షుడు దుర్గం నర్సింహులు, గిరిజన మోర్చా , కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపె మహేష్, రాళ్లబండి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఏసీసీ, ఆగస్టు 10: పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ గెస్ట్ హౌస్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ రెండో శనివారం ప్రభుత్వ సెలవుదినం అయినందున విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు జారీ చేసినప్పటికీ జిల్లాలోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు పాటించకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను, బోధన బోధనేతర సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రైవేటు విద్యాసంస్థలు సెలవు దినాల్లో విద్యాసంస్థలను నడుపుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: ప్రతి నెలా రెండో శనివారం విద్యాసంస్థలన్నీ సెలవు దినంగా పాటించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను జిల్లాలో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు బేఖాతరు చేస్తున్నాయని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విభాగ్ కన్వీనర్ అజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు నిర్వహించిన పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

కోటపల్లి, ఆగస్టు 10: మండలంలోని సర్వాయిపేట గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను శనివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పంచాయతీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని, ప్రజలకు అందుబాటులో ఉండి పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ధనుంజయ్, బాపు నాయక్, చందు, రాజేష్‌నాయక్, నగేష్, శేఖర్, రాములు, సమ్మయ్య , సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మందమర్రిరూరల్, ఆగస్టు 10: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నందున విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని ఏఈ జయకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సారంగపల్లి, చిర్రకుంట, శంకర్‌పల్లి, పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

9వ వార్డులో కంటి వైద్య శిబిరం

శ్రీరాంపూర్, ఆగస్టు 10: నస్పూర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఫౌడేషన్ ఆధ్వర్యంలో శనివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వాటర్ ట్యాంక్ ఏరియాలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిచారు. . కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుర్రె చక్రవర్తి, నాగార్జున, పులి క్రాంతి, దివ్య, అజయ్, సీతారాం, సాత్విక్, శ్రీను, కిట్టన్న, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకుందాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 10: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహనీయులను స్మరించుకుందామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల తెలంగాణ తల్లి విగ్రహాన్ని శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో పాలు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతం త్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేప ట్టామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయరామరావు, లచ్చన్న, అశోక్, రాజబాబు, రవీందర్, శ్రీధర్, తజీమ్, వెంకటేశ్వర్‌రావు, శ్రీదేవి, రాజు, రాకేష్, సతీష్, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్, రాజన్న, రాజబాబు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహాన్ని బీజేపీ నాయకులు నీటితో శుద్ధి చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆనాడు మహనీయుల చేసిన పోరాటం వల్లనే ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అశ్విన్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లేష్, ప్రశాంత్, శ్రీనివాస్, ధర్మయ్య, రాజనర్సు, వెంకటిరెడ్డి, శ్రీనివాస్,సురేష్, సతీష్, స్వామి, తిరుపతి, సురేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలను బీజేపీ మండల నాయకులు నీటితో శుద్ధి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇన్‌చార్జీ గుండ ప్రభాకర్, నాయకులు రవిగౌడ్, సురేందర్, శ్రీనివాస్, వెంకటేష్, సత్తయ్య, సతీష్, వెంకటేశ్వర్లు, నర్సింగ్‌నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. సతీష్, శ్రీనివాస్, రాజేష్, శంకర్, సుధాకర్, విజయ పాల్గొన్నారు.


మంచిర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు


దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి శుద్ధి చేస్తున్న నాయకులు

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

చెన్నూరు, ఆగస్టు 10: మండలంలోని కత్తెరసాల గ్రామంలో కూకట్ల శ్రీకాంత్ అనే రైతుకు చెందిన గొర్రె శనివారం విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. రోజులాగే గొర్రె మేతకు వెళ్తున్న సమయంలో గ్రామంలోని మిని ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్ స్తంభం వైపు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన విద్యుత్ స్తంభానికి తగిలి విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు తెలిపాడు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఏసీసీ, ఆగస్టు 10: మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్‌లో అదనపు పీపీ సురేందర్ ఉపాధ్యాయ, జ్యుడిషియల్ స్టాఫ్ టీం జట్లు తల పడ్డాయి. సురేందర్ ఉపాధ్యాయ టీం విజేతగా నిలిచింది.

మొక్కలతోనే మానవ మనుగడ

మందమర్రి టౌన్, ఆగస్టు 10: మొక్కలతోనే మాన వాళికి మనుగడ అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పదికి పైగా మొక్కలు నాటి సంరక్షించాలని సదా సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సంగి సంతోష్ తెలిపారు. పట్టణంలోని పలు వార్డులలో శనివారం ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 41 రోజులుగా పట్టణంలోని అన్ని వార్డుల్లో పదికి పైగా మొక్కలు పంపిణీ చేశామని, ఈ వర్షాకాలంలో మొక్కలు నాటడం ద్వారా అవి ఎదగడానికి దోహదపడతాయని చెప్పారు. పిల్లలను ఏ విధంగా సంరక్షిస్తామో అదే విధంగా మొక్కలను సంరక్షిం చాలని కోరారు. కాగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కన్వీనర్ మహంత్ అర్జున్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మొక్కలోనే సాధ్యమని చెప్పారు. కాలుష్య నివారణ మొక్కల తోనే సాధ్యమని, దీనిలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలకు ప్రభుత్వం పూనుకుందని పేర్కొన్నారు. నివాసాలతో పాటు ఖాళీ స్థలాల్లో అందరు మొక్కలు నాటితే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఇంటింటా మొక్కలు నాటి సంరక్షించేందుకు బాధ్యతగా పాటుపడాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెల్లంపల్లి, ఆగస్టు 10: బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్‌లోని ఓ ఇంట్లో శనివారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ. 19,500, ఆరు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణ నిమిత్తం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బెల్లంపల్లి, ఆగస్టు 10: పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు శనివారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశామని తెలిపారు.

'బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి'

జైపూర్, ఆగస్టు 10: మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్‌పార్టీకి చెందిన గోగుల రవీందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ యూత్ మండల నాయకులు శనివారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వంభర్‌రెడ్డి, కుడెల్లి శ్రీనివాస్ రెడ్డి, రిక్కుల లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ గోగుల రవీందర్‌రెడ్డి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌పై బీజేపీ కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసి బీజేపీలో చేరుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రచారాలు చేశారన్నారు. వీటిని సహించబోమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్‌కు ఘన సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 10: ఆర్‌కే 5,6 గ్రూప్ ఏజెంట్‌గా పనిచేసి ఎ వెంకటేశ్వర్‌రెడ్డి ఇందారంకు బదిలీ కావడంతో గనిపై శనివారం సన్మానించారు. ముఖ్య అతిథిగా బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శులు రాగం రాజేందర్, జీడి ప్రభాకర్, ఆఫీస్ ఇన్‌చార్జి దొంతుల రాజేంద్రప్రసాద్, పిట్ కార్యదర్శి గోనె రామకృష్ణ, సహాయ కార్యదర్శి పగిడి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి



రహదారిపై ధర్నా చేస్తున్న పాడి రైతులు

రామకృష్ణాపూర్, ఆగస్టు 10: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం పాడి రైతులు ధర్నా చేపట్టారు. క్యాతన్‌ప ల్లి క్రాస్ రోడ్డు జాతీయ రహదారి వద్ద తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కో కన్వీనర్ వీరమల్ల రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఐదు రూపాయల ఇన్సెంటీవ్‌ను పాల బిల్లుతో కలిపి ఇవ్వాలన్నారు. 50 శాతం సబ్సిడీ తెలంగాణ విజయ డెయిరీకి పాలు పోసే వారికి మాత్రమే సబ్సిడీపై గేదెలను పంపిణీ చేయాలని కోరారు. డెయిరీకి పాలు సేకరించిన వారికే ప్రత్యేక సబ్సిడీలు అందిం చేలా చర్యలు చేపట్టాలని, అన్ని జిల్లాలో సొసైటీ ద్వారా ఎన్నుకోబడిన రైతులను మాత్రమే చైర్మన్‌లుగా నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, పాడి రైతులకు కావాల్సిన దాణ, మినరల్స్, క్యాల్షియం, గడ్డి విత్తనాలు 75 శాతంపై వచ్చే విధంగా చూడాలని చెప్పారు. 2019 నుంచి లీటరుకు 4 రూపాయలు ఇన్సెంటివ్ ఇప్పటి వరకు చెల్లించలేదని చెప్పారు. ఇప్పటికైనా పెండింగ్ డబ్బులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా విజయ డెయిరీ కార్యదర్శి అంకతి రాయమల్లు, మందమర్రి మండల అధ్యక్షుడు కుమార్, క్యాతన్‌పల్లి అధ్యక్షుడు రాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ నాయకుడి జన్మదిన వేడుకలు

శ్రీరాంపూర్, ఆగస్టు 10: టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శ్రీరాంపూర్‌లోని శ్రీ సాయి వృద్ధులు, అంధుల ఆశ్రమంలో శనివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, గొర్ల సంతోష్, రాజు నాయక్, మైపాల్ రెడ్డి, జగదీష్, రవి పాల్గొన్నారు.

ఆగిఉన్న గూడ్స్‌రైలులో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, ఆగస్టు10: జగిత్యాల పట్టణంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న గూడ్స్ రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గూడ్స్ రైలులో బొగ్గు వ్యాగన్‌లో మంటలు చూసి స్టేషన్‌మాస్టర్ అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొనిమంటలను ఆర్పివేశారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



పాత జీఎం కార్యాలయం ఎదుట బైఠాయించిన బస్తీవాసులు

బెల్లంపల్లి, ఆగస్టు 10: విద్యుత్‌సమస్యను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని పాత జీఎం కార్యాలయం ఎదుట శనివారం బూడిదగడ్డ బస్తీ, టేకుల బస్తీ, బెల్లంపల్లి బస్తీకి చెందిన ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ బస్తీల్లో సింగరేణి కరెంటును నిలిపివేయడంతో మూడు రోజులుగా అంధ కారంలో ఉంటున్నామన్నారు. విష పురుగులు, పాములు, తేళ్లు వస్తున్నాయని చెప్పారు. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి బస్తీల్లో సింగరేణి కరెంటును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బీసీలు ఐక్యతతో అభివృద్ధి సాధించాలి

ఏసీసీ, ఆగస్టు 10: జస్టిస్ పుంజాల శివశంకర్‌ను స్ఫూర్తిగా తీసుకుని బీసీలు ఐక్యతతో అభివృద్ధి సాధించాలని తెలంగాణ మున్నూరు కాపు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఇక్యాల కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం జస్టిస్ పుంజాల శివశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, సురేష్ పటేల్, శ్రావణ్, ఆకుల లక్ష్మీనారాయణ, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ బీట్‌లో చెట్లు నరికివేత

జన్నారం, ఆగస్టు 10: తాళ్లపేట రేంజ్‌లోని మహమ్మ దాబాద్ బీట్‌లో టేకు చెట్లు నరికిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో సుష్మారావు తెలిపారు. స్థానికంగా శనివారం ఎఫ్‌ఆర్వో మాట్లాడుతూ మహమ్మదాబాద్ నుంచి మల్యాల గ్రామానికి వెళ్లే దారి వెంట విద్యుత్ లైన్ ఉందన్నారు. విద్యుత్ లైన్ కింద ఉన్న సుమారు 20 టేకు, నాన్‌టేక్ చెట్లను నరికివేశారని చెప్పారు. అధికారులకు సమాచారం లేకుండా చెట్లను నరికిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మహమ్మదాబాద్ బీట్‌లో నరికిన చెట్లు

సత్యదేవుడి సన్నిధిలో
ప్రత్యేక పూజలు

దండేపల్లి, ఆగస్టు 10: ప్రవిత శ్రావణమాసం పురష్కరించుకోని మొదటి శనివారం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానంలో భక్తులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే పలు జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.



వ్రతం చేస్తున్న భక్తులు

ఇండస్ట్రియల్ హబ్
ఏర్పాటుకు చర్యలు

● కలెక్టర్ కుమార్ దీపక్



వేంపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, ఆగస్టు 10: జిల్లాను మరింత వేగంగా అభివృద్ధి చేసేందుకు జిల్లాలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని వేంపల్లిలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ఔత్సాహిక వ్యాపారులు, పరిశ్రమల అభివృద్ధికి ముందు రావాలని సూచించారు. జిల్లాలో ఖనిజ, బొగ్గునీటి వనరులు సమృద్ధిగా ఉన్నాయని, వ్యాపారాన్ని విస్తరించేందుకు రోడ్డు, రైలు, రవాణా మార్గాలు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ముందుకు వచ్చే ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ప్రభుత్వం తరుపున నిబంధనల మేరకు ప్రోత్సాహం అందించి సహకరి స్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిత, అధికారులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని రేండ్లగూడ, కిష్టాపూర్ గ్రామాల్లో కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించారు. శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్డులో వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటా చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు.నర్సరీలను పరిశీలించి మొక్కలను పెంచాలని సూచించారు. రేండ్లగూడలోని నర్సరీని పరిశీ లించి గ్రామ మాజీ సర్పంచు ఆశారాజ్‌ను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యా వరణంతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యతగా పాటుపడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ప్రత్యేకాధికారులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 10: ప్రజలకు తెల్ల రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇతర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నానిర్వహించనున్నామని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా అధ్యక్షుడు జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ధర్నాలో పార్టీ నాయకులు, ప్రజలు, విద్యార్థులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పేద ప్రజలకు న్యాయం జరిగేలా పథకాల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పథకాల అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, రాజేందర్, రమాదేవి, పోచన్న, ఆదిలక్ష్మీ, రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం వాయిదా

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 10: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో ఆదివారం నిర్వహించతలపెట్టిన వైద్య శిబిరాన్ని వాయిదా వేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె భాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వైద్య శిబిరాన్ని వాయిదా వేశామని, క్యాంపును నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

కాసిపేట, ఆగస్టు 10: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్టేషన్ పెద్దనపల్లికి చెందిన ముక్కెర రోషిణి (24) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందిందని కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ, కుటుంబీకులు తెలిపిన వివరాలప్రకారం రోషిణికి స్టేషన్ పెద్దనపల్లికి చెందిన వెంకటేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్య భర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసి నచ్చ చెప్పారు. కానీ ఈ నెల 8న జ్వరం వచ్చిందని 9వ తేదీన బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రిలో చేర్పించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. రోహిణి తండ్రి పిట్టల తిరుపతి తన కూతురుది సహజమరణం కాదని, అనుమానంగా ఉందని ఫిర్యాదు చేసినట్లు కాసిపేట ఎస్‌ఐ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు అభినందన

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 10: సీపీజీఈటీ (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్)లో శ్రీహర్ష డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించగా వారిని శనివారం ఆ కళాశాల చైర్మన్ పల్లె భూమేష్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా పల్లె భూమేష్ మాట్లాడుతూ 2024 సీపీగేట్‌లో ఎంకామ్ విభాగంలో అల్తాఫ్ 42వ ర్యాంకు, ఎమ్మెస్సీ డేటా సైన్స్ విభాగంలో సమర్‌సేల్ 55వ ర్యాంకు, ప్రణయ్ 89వ ర్యాంకు, సీహెచ్ సాయికిరణ్ 318వ ర్యాంకు, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ విభాగంలో ఎం శ్రావణి 171వ ర్యాంకులను సాధించి సత్తా చాటారని చెప్పారు. తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అదిరోహించి రేపటి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత ఠాకూర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి



నినాదాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఏసీసీ, ఆగస్టు 10: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం సంఘం అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిన యూటీఎఫ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వర్ణోత్సవాలు జరుపుకుందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని శిఖరాగ్రాన నిలిపి ఐక్య ఉద్యమాలు నిర్మించి ప్రముఖ విద్యావేత్తలు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ కె నాగేశ్వర్, లక్ష్మణ్‌రావు, బాలసుబ్రమణ్యం వంటి తొమ్మిది మంది ఉపాధ్యాయులను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా గెలిపించుకున్న ఘనత సంఘానికి దక్కిందన్నారు. ఉపాధ్యాయులకు రీగ్రూప్ స్కేలింగ్ సాధించడం, అప్రెంటిస్ రద్దు, రెండేళ్లకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు సాధన వంటి వాటిని ఉద్యమాల ద్వారా సాధించిందని చెప్పారు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్య దర్శి గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గొల్ల రామన్న, ఉపాధ్యక్షులు నర్సయ్య, లావణ్య , కోశాధికారి కిరణ్ పాల్గొన్నారు.

సిబ్బంది సహకారం మరువలేను: సీఐ

వాంకిడి, ఆగస్టు 10: వాంకిడి, కెరమెరి మండలాల్లో లాఅండ్‌ఆర్డర్‌ను సక్రమంగా నడిపేందుకు సిబ్బంది తనకు అందించిన సహకారం మరువలేనిదని సీఐ శ్రీనివాస్ అన్నారు. వాంకిడి నుంచి కరీంనగర్ జిల్లాకు బదిలీపైవెళ్తున్న సీఐ శ్రీనివాస్‌కు స్థానికపోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది శనివారం ఘనంగా ఆత్మీయవీడ్కోలు పలికారు. శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ తాను వాంకిడి, కెరమెరి మండలాల్లో పని చేసిన రెండున్నర ఏళ్ల సిబ్బంది తనపై చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. పోలీసుశాఖలో బదిలీలు సర్వసాధారణం అయినప్పటికీ వాంకిడి మండలాన్ని వదలి వెళ్లాలంటే ఒకింత బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో వాంకిడి ఎస్సై సాగర్, కెరమెరి ఎస్సై విజయ్, ఏఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.



సీఐని సన్మానిస్తున్న సిబ్బంది

జ్వరంతో విద్యార్థిని మృతి



పూజ(ఫైల్)

కౌటాల, ఆగస్టు 10: కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికిచెందిన జాడి కిషోర్-సురేఖల మొదటి కూతురు పూజ(16) జ్వరంతో శనివారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పూజ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. నాలుగు రోజులుగా జ్వరం రావటంతో పాఠశాలసిబ్బంది ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో పూజ తండ్రి కిషోర్ గురువారం పాఠశాలకు వెళ్లి ఇంటికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. జ్వరం తగ్గకపోవటంతో శుక్రవారం మెరుగైన చికిత్సకోసం మహారాష్ట్ర చంద్రాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. శనివారం పరిస్థితి మరింత విషమించటంతో మెరుగైనవైద్యం కోసం చంద్రాపూర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లుతున్న క్రమంలో మృతిచెందింది.

సమస్యలకు నిలయంగా బెజ్జూరు ప్రాథమిక పాఠశాల

● వర్షాలకు ఊరుస్తున్న గదులు ● ఒకే గదిలో అన్ని తరగతులు
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● పట్టించుకోని అధికారులు



బెజ్జూరులోని ఉర్దూ మీడియం పాఠశాల



ఒకేచోట చదువుతున్న విద్యార్థులు

బెజ్జూరు, ఆగస్టు 10: ఒకే పాఠశాల గది. ఉన్న పాఠశాల గదులేమో వర్షాలకు ఊరుస్తున్నాయి. దీంతో చేసేదేమి లేక అన్ని తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. ఒకే పాఠశాల గదిలో అన్ని తరగతుల విద్యార్థులు ఉండటంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇది మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి. ప్రభుత్వాలేమో అన్ని ప్రభుత్వపాఠశాలల్లో ఉచితపుస్తకాలు, దుస్తులు, ఉచితవిద్య అని, అన్నిరకాల వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో మాత్రం ఏమాత్రం అమలు కావడం లేదు. మండల కేంద్రంలోని తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు ఒకే దగ్గర కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలుగు మీడియంలో 5తరగతులు కొనసాగుతుండగా 105 మంది విద్యార్థులు ఉన్నారు. ఉర్దూమీడియంలో 8తరగతులు ఉండగా 28 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తెలుగు మీడియం పాఠశాల గదులు వర్షాలకు పూర్తిగా తడిచిపోవడంతో పైనుంచి ఊరుస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉర్దూపాఠశాలలోనే కూర్చోబెట్టి చదివిస్తున్నారు. ఒకే పాఠశాలలో ఇంత మంది విద్యార్థులు ఉండటంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నాళ్లీ దుస్థితి..

మండలకేంద్రంలోని పాఠశాలల్లో ఈ ఇబ్బందులు ఎన్నాళ్లు అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది కూడా ఇదే ఇబ్బంది తలెత్తినా అధికారులు ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం మాత్రం ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వపాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో అమలుకావడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. అన్నిగదులు వర్షాలకు ఊరుస్తూ శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియనిస్థితిలో ఉన్నాయని అందుకే విద్యార్థులను ముందుజాగ్రత్తగా ఒకేచోట కూర్చోబెడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. దీంతో విద్యార్థులు అసౌకర్యాల మధ్య చదువులు సాగిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఊరుస్తున్న పాఠశాల పైకప్పు



ఊరిసిన నీటితో తడిసిన గచ్చు

తిర్యాణి ఎస్సైగా వేణుమాధవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై వేణుమాధవ్

తిర్యాణి, ఆగస్టు 10: తిర్యాణి ఎస్సైగా వేణుమాధవ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన రమేష్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో సిర్పూర్(యు) ఎస్సైగా పనిచేస్తున్న వేణుమాధవ్ బదిలీపై వచ్చారు.

ఘనంగా పుంజాల శివశంకర్ జయంతి



నివాళులు అర్పిస్తున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 10: మున్నూరు కాపు జాతి పిత, మాజీకేంద్ర మంత్రి, మాజీగవర్నర్ జస్టిస్ పుంజాల శివశంకర్ జయంతి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం స్థలంలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటా నికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు సురేష్, వెంకటేష్, సతీష్, గణపతి, జక్కయ్య, శంకర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పోశన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 10: జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని బీసీ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతవిద్య విషయంలో చాలా వెనకబడిఉందన్నారు. జిల్లాలో చాలావరకు వ్యవసాయం పైనే ఆధారపడిన కుటుంబాలే ఎక్కువ ఉన్నా యన్నారు. జిల్లాలో వ్యవసాయ యూనివర్సిటీ ఉంటే ఆధునిక సాంకేతిక పద్ధతులను నేర్చుకునే అవకాశం ఉంటుంద న్నారు. ఆయనవెంట నాయకులు ప్రదీప్, కార్తీక్, సందీప్, ఉదయ్ ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రణయ్‌కుమార్

ఆగని రేషన్ బియ్యం దందా



ద్విచక్ర వాహనంపై సరిహద్దు దాటిస్తున్న బియ్యం వ్యాపారి



- లబ్ధిదారుల నుంచి సేకరణ.. క్వింటాళ్లుగా విక్రయం
- యథేచ్ఛగా మహారాష్ట్రకు తరలింపు
- కేసులతోనే సరి పెడుతుండడంతో మళ్లీ అదే దందా
- పీడీ యాక్టుకు అవకాశం ఉన్నా దృష్టి సారించని అధికారులు

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు..ఆరు కాయలుగా కొనసాగుతోంది. పక్కనే మహారాష్ట్ర ఉండడంతో ఇక్కడ తక్కువ ధరకు కొని అక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కో కుటుంబం నుంచి కిలల లెక్కన కొనుగోలు చేసి క్వింటాళ్ల లెక్కన బయట విక్రయి స్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అప్పుడప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు తప్పితే లోతుగా దర్యాప్తు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి.

బెజ్జూరు, ఆగస్టు 10: ప్రజాపంపిణీ బియ్యం పక్క దారి పడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన తరువాత కొన్ని నెలలు వరకు స్తబ్దుగా ఉన్న రేషన్ బియ్యం వ్యాపారులు ఇప్పుడు అక్రమ బియ్యం రవాణాకు తెరలేపారు. రాజకీయ అండదండలతో వ్యవహారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రేషన్‌బియ్యం సేకరణకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ముఠాలు పని చేస్తున్నాయి. చైన్‌సిస్టంలా పని చేస్తూ ఒకరి నుంచి ఒకరు ప్రజల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. వాటిని పెద్దమొత్తంలో సేకరించి మహా రాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. సేకరించిన బియ్యానికి కిలోకు రూ.10 వరకు కమీషన్ మిగులు తుండటంతో చాలా మంది దీనిని వృత్తిగా మలుచుకుంటున్నారు. నిత్యం రవా ణా జరుగుతూనే ఉన్నా ఎప్పుడో ఒక్కసారి పట్టుబ డటం గమనార్హం.

రవాణా ఇలా..

ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని తినేందుకు చాలా మంది ఇష్టపడటం లేదు. వీటిని వదిలి బహి రంగ మార్కెట్‌లో సన్నబియ్యం కొంటున్నారు. ఇంట్లో దొడ్డు బియ్యం తినడం లేదని మరికొంత మంది విక్ర యిస్తున్నారు. సగటున కిలోకు రూ.10చొప్పున దళా రులకు, ఇతరులకు అమ్ముతున్నారు. మరికొన్ని చోట్ల ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తు న్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని మహారాష్ట్ర సరి హద్దుల్లో ఉన్న బెజ్జూరు, కౌటాల, సిర్పూర్(టి), చింతలమానేపల్లి తదితర మండలాల్లో రేషన్ దందా జోరుగా కొనసాగుతోంది.

ఆయా మండలాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి బియ్యానికి మహారాష్ట్రలో మంచి డిమాండ్ ఉండటంతో కొంత మంది ఇదే పనిగా పెట్టుకొని బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇక్కడ కిలో కు రూ.10నుంచి 15వరకు కొనుక్కొని అక్కడ కిలోకు రూ.20 నుంచి 25వరకు అమ్ముకుంటున్నారు. కౌటాల, చింతలమా నేపల్లి, బెజ్జూరు మండలాల సరిహద్దున గల ప్రాణ హిత నదిపై గూడెం వద్ద వంతెన పూర్తి కావడంతో అక్రమార్కులకు ఇది రాచమార్గంగా మారింది. ప్రతి నిత్యం రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలు, బొలేరో, ఆటోల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇక సిర్పూర్ వంటి మండలం నుంచి రైళ్ల ద్వారా బియ్యాన్ని అక్కడికి చేర్చుతూ సొమ్ము చేసుకుంటు న్నారు. సంబంధిత అధికారులు తరచూ దాడులు చేస్తున్నా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. కొంతమంది రేషన్ ఇచ్చే డీలర్ల వద్ద నుంచే బియ్యాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. డీలర్లు బియ్యం పంపిణీ చేస్తు న్న సమయంలోనే దళారులు లబ్ధిదారుల నుంచి అక్కడే కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రేషన్ డీలర్లు కూడా దళారులతో చేతులు కలిపి ఈ వ్యవహారం నిర్వహిస్తున్నట్లు సమాచారం. డీలర్లు బయటకు రాకుండా ఉండేం దుకు దళారుల చేత బియ్యాన్ని సేకరించి వచ్చిన ఆదాయంలో సమంగా పంచుకుంటున్నారని బాహా టంగానే ఆరోపణలు ఉన్నాయి.

తూతూ మంత్రంగా దర్యాప్తు..

జిల్లాలో రోజుల వ్యవధిలోనే అధికారులు అక్రమం గా నిల్వ ఉంచిన, తరలి స్తున్న బియ్యాన్ని పట్టుకుం టున్నారు. కానీ వాటి మూలాల్లోకి మాత్రం వెళ్లడం లేదు. పట్టుబడిన వ్యక్తులు ఎక్కడినుంచి వాటిని సేక రించారు. ఎన్ని నెలల నుంచి వ్యాపారం సాగుతోంది. తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు జరగకపోవడం వల్లనే కేసులు నమోదైనా మళ్లీ ఇదే దందా సాగిం చడమో లేదంటే వారి ప్రతినిధులను ఈ వ్యాపారంలో దింపి వెనుకనుంచి నడిపించడం లాంటివి చేస్తున్నా రని తెలుస్తోంది. దొరికిన బియ్యానికి లెక్కలు అడిగి చర్యలు తీసుకుంటున్నారు. తప్పితే వారి వ్యాపార చరిత్రపై ఆరా తీయడం లేదు. ఇప్పటికైనా అధికారు లు బియ్యం అక్రమ రవాణాపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..

విక్రం, ఎస్సై, బెజ్జూరు



గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న రేషన్‌బియ్యం మహారాష్ట్రకు తరలించే వ్యక్తులపై చర్యలు తప్పవు. బియ్యం నిల్వలు ఉన్నట్లయినా, తరలించినా తమకు సమాచారం అందిస్తే పట్టుకొని కేసులు నమోదు చేస్తాం.

హై లెవల్ వంతెనలు నిర్మించరూ..!

- యేటా వర్షాకాలంలో మునుగుతున్న లో లెవల్ వంతెనలు
- గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు



మండలకేంద్రంలో లోలెవల్ వంతెన దాటుతున్న విద్యార్థులు(ఫైల్)

లింగాపూర్, ఆగస్టు 10: ఏటా వర్షాకాలంలో మండ లంలోని పలు గ్రామాలకు లోలెవల్ వంతెనలతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వర్షాలకు రోడ్లు తెగిపోవడం, వంతెనలు కోతకు గురికావడం వంటివి సంఘటనలు జరుతున్నాయి. ఇటువంటివి జరిగిన ప్పుడు మాత్రమే ప్రజాప్రతినిధులు, అధికారులు సుడిగాలి పర్యటనలు చేసి హామీల మీద హామీలు ఇచ్చిపోతున్నారు తప్ప సమ స్యలను పరిష్కరించడం లేదు. ఉన్నతాధికారులు సైతం స్థానిక మండల అధి కారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశిస్తున్నారే తప్పా వంతె నల నిర్మాణంలో మాత్రం పురోగతి కనిపించడంలేదు. దీనితో మండలవాసులకు ప్రతీయేడాది వరదకష్టాలు తప్పడంలేదు. ఎండా కాలం లోనే హైలెవల్ వంతెనల నిర్మణాలు చేపడితే వచ్చే వర్షకాలం వచ్చే సరికి ప్రజలకు కష్టాలు తప్పుతాయని మండల వాసులు పేర్కొం టున్నారు.

రాకపోకలు బంద్..

మండలంలోని లోలె వల్ వంతెనలతో కొత్త పల్లి, ఘూంనూర్, వంక గద్ది1, వంకామద్ది2, ఫట్కు ల్యాంగి, మెతిపట్వార్, ఘూంనూర్(కే), కంచన్ పల్లి, ములగూడా, లింగా పూర్ జగదంబానగర్, జిల్లా పరిషత్ పాఠ శాల, నడంగూడా, తది తర గ్రామాలకు వెళ్లే ప్రధన రహదారిలో అనేక లోలెవల్ వంతెనాలు ఉన్నాయి. దీనితో చిన్నపాటి వర్షం కురిసినా వాగుల వరదలతో ఇబ్బందులు ఎదురై రాకపోకలు నిలిచిపోతున్నాయి.



ఘూంనూర్ అల్లీగూడ వద్ద వరద రావడంతో ఒడ్డున వేచి ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు(ఫైల్)

● ఎటూ వెళ్లలేని పరిస్థితి..

- కనక జ్యోతీరాం,
మాజీ సర్పంచ్, కంచన్‌పల్లి



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి లేదా నిత్యావసర సరుకులకు జైనూర్ మార్కెట్ వెళ్లాలంటే ముదు లోలెవల్ వంతెనాలు దాటాల్సి ఉంటుంది. కొద్దిపాటి వర్షం కురిసినా వాగుల వరదలతో వంతెనలు దాటాలంటే నరకమే. అనేకసార్లు ఉన్నతాధికారులకు పాలకులకు విన్నవించాం. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందిచి హైలెవల్ వంతెనలు నిర్మించాలి.

● మా కష్టాలు వర్ణనాతీతం..

- కోట్నాక నాగమణి,
ఉపాధ్యాయురాలు, ఘూంనూర్

వర్షాకాలం మూడునెలలు మాబాధలు వర్ణనా తీతం. చిన్నపాటి వర్షం కురిసినా ఇంటికి వెళ్ళ గల్గుతామా లేదా అనే భయం వేస్తుం ది. ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లాలంటే మూడు లోలెవల్ వంతెనలు దాటి వెళ్లాలి. వర్షకాలం తగ్గినా కూడా రెండు నెలల పాటు రోడ్లతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ దారుల్లో హైలెవల్ వంతెనలు నిర్మిస్తే అందరికీ ఉపయోగపడుతాయి.

కాగజ్‌నగర్, బెజ్జూర్‌లో వర్షం

బెజ్జూరు, ఆగస్టు 10: మండలంలో శనివారం వర్షం కురిసింది. ఇప్పటికే అధికవర్షాలు కురవ డంతో పత్తి రైతులు ఆందోళన చెందగా కురిసిన వర్షం పంటలకు మరింత నష్టం చేకూర్చే అవ కాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తిమొదళ్లకు తెగుళ్లవ్యాప్తించి నష్టపోయే అవ కాశంఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఉండగా సాయంత్రం వర్షం కురవ డంతో ఉపశమనం కలిగినట్లయింది. కాగా, అర గంటపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతా ల్లోకి వర్షంనీరు చేరింది. అలాగే అంతర్గతరోడ్లు బురదమయం అయ్యాయి.



బెజ్జూరులో కురుస్తున్న వర్షం

సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ సెక్రెటరీకి వినతిపత్రం అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

కాగజ్‌నగర్, ఆగస్టు 10: కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో పురపాలక అడిషనల్ సెక్రెటరీకి పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్మికుల బకాయిలు తది తర అంశాలను ఈ సందర్భంగా సభ్యులు వారికి వివ రించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీము న్సిపల్ చైర్మన్ దస్తగిర్, కౌన్సిలర్లు ఉన్నారు.

పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలి

వాంకిడి, ఆగస్టు 10: చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని హెచ్‌ఈవో రవిదాస్ సూచిం చారు. శనివారం మండలంలోని నర్లపూర్ గ్రామం లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య పోషన దినోత్సవాన్ని పురస్కరించుకొని టీకాల కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంగన్‌వాడీకేంద్రాల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు టీకాలు వేస్తారని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎ న్ఎం కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

సింగరేణిలో మైన్, సేఫ్టీ కమిటీ సమావేశాలు ఏర్పాటు

మందమర్రి టౌన్, ఆగస్టు 10: సింగరేణిలో ఎట్టకేలకు మైన్‌కమిటీ, సేఫ్టీకమిటీ సమావేశాలను శనివారం యాజమాన్యం ప్రారంభించింది. గనులు, డిపార్టుమెంట్ల వారీగా మైన్, సేఫ్టీ కమిటీ సమా వేశాలు నిర్వహించింది. గనుల్లో ప్రమాదాల నివారణ, రక్షణ చర్యలకు సంబంధించి సూచ నలు, సలహాలు స్వీకరించింది. ప్రమాదరహిత ఉత్పత్తితో పాటు పకడ్బందీ రక్షణచర్యలకు తీసుకోనున్న ప్రణాళికలను మైన్ కమిటీ, సేఫ్టీ కమిటీలకు వివరించింది.

ఏరియాలోని ఎల్లందుక్లబ్‌లో అన్ని గనుల, డిపార్టుమెంట్ల సేఫ్టీ మైన్‌కమిటీ సభ్యులతో సమా వేశం నిర్వహించగా సింగరేణి సీఎండీ బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సింగరేణిలో ఇకనుంచి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన విధివిధానాలను వివరించారు. కమిటీ సభ్యులు వీటికి సంబంధించి ఉద్యోగులకు వివరిం చాలని, ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమనే నినాదాన్ని చాటుతూ ప్రతి ఒక్కరు పనిచేసేలా చూడాలని తెలిపారు. సింగరేణి యాజమాన్యం రానున్న రోజుల్లో ప్రమాదాలు లేని సంస్థగా ఆదర్శంగా నిలిచేలా చూడాలని కోరారు. సమా వేశాలు ఏర్పాటు చేయడంపై కమిటీల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



'హైపవర్ వేతనాలు అందించాలి'

శ్రీరాంపూర్, ఆగస్టు 10: దేశవ్యాప్తంగా బొగ్గుగనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని అఖిలభారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ (ఏబీకేఎంస్-బీఎంఎస్) జాతీయ కార్యవర్గసభ్యుడు పులి రాజారెడ్డి కోరారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో శుక్రవారం జరిగిన మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హై పవర్‌కమిటీ వేతనాలు, సీఎంపీఎఫ్, ఈఎస్ఐ, పీఎల్ఆర్ఎస్, పీహెచ్‌డీ, పేడేలు పర్మనెంట్ కార్మికుల మాదిరిగా అమలు చేయాలన్నారు.

కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలి: బీఎంఎస్

శ్రీరాంపూర్, ఆగస్టు 10: సింగరేణిని కాపాడుకోడానికి కార్మి కులు పోరాటానికి సిద్ధం కావాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ ఒకప్రకటనలో కోరారు. గతంలో రెండు పర్యాయాలు గెలిచిన ఏఐటీయూసీ కాంట్రాక్టీకరణకు మద్దతు తెలిపిందని, ఇప్పుడు కూడా అదేదారిలో వెళ్తోందని ఆరోపించారు. పర్మినెంట్ కార్మికులు తీసే బొగ్గు 15శాతం కాగా, ప్రైవేటు వ్యక్తులుతీసేది 85శాతంగా ఉందన్నారు. ఈ విషయం గమనించి కార్మికులు ఉద్యమించడానికి సిద్ధం కావాలని కోరారు.

అధికారులకు ఘన సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, ఆగస్టు 10: ఇందారం ఉపరితల గనిలో ప్రాజెక్ట్ అధికారిగా పని చేస్తూ బెల్లంపల్లి జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న ఎం శ్రీనివాస్‌ను శ్రీరాంపూర్ ఏరి యా జీఎం బి సంజీవరెడ్డి శనివారం ఘనంగా సన్మా నించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనా రాయణ, ఏజెంట్లు గోపాల్ సింగ్, రాముడు, డీజీ ఎంలు అరవిందరావు, చిరంజీవు లు, యాదయ్య అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌వోటు జీఎంకు: శ్రీరాంపూర్ ఎస్‌వోటు జీఎంగా బదిలీపై వచ్చిన ఎన్ సత్యనారాయ ణను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారా మయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో యూనియన్ ఉప ప్రధానకార్యద ర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మ య్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్కె బాజీసైదా పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సన్మానం: ఇందారం గ్రూప్‌ఏజెంట్‌గా పనిచేసి బెల్లంపల్లి ఏరియా జీఎంగా వెళ్తున్న ఎం శ్రీనివాస్, ఆర్కే5,6 గ్రూప్‌ఏజెంట్‌గా పనిచేసి బదిలీపై ఇందారం గ్రూప్‌ఏజెంట్‌గా వచ్చిన ఎ వెంకటేశ్వర్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు శనివారం ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్రక మిటీనాయకులు కలవేనశ్యామ్, గరిగ శ్యా మ్, భీమ్‌రావు, తిరుపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: ఐకే ఓసీపీఅధికారిగా పనిచేసిన శ్రీనివాస్ బెల్లంపల్లి ఏరియా జీఎంగా పదో న్నతిపై వెళ్తున్నందున ఆయనను ఐకే1ఏ, ఓసీపీ అధికారులు శనివారం గని ఆవరణ లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

ఆసిఫాబాద్, ఆగస్టు 10: జిల్లాకేంద్రంలో సీఐటీయూ భవనంలో శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఇందురావు పతాకావిష్కరణ చేశారు. యూటీఎఫ్ నిరంతరం ఉపాధ్యాయ, ఉద్యోగులసమస్యలపట్ల పోరాటాలు కొనసాగిస్తూ విద్యారంగాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హేమంత్, రమేష్, ఊశన్న, తిరుపతి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

దహెగాం, ఆగస్టు 10: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో కళాజాతా బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌వో రిజ్వానా, సీఆర్పీలు, విద్యార్థులు, పోలీసులు, కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెకు దిగిన మిషన్‌భగీరథ కార్మికులు

బెజ్జూరు, జూలై 10: ఆరునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో మండలంలోని మిషన్‌భగీరథ కార్మి కులు శనివారం సమ్మెకు దిగారు. కనీసం నిత్యావసర సరుకులు కూడా కొనలేని పరిస్థితి నెలకొంద న్నారు. వేతనాలు ఇచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

సిర్పూర్(టి): మండలంలో మిషన్ భగీరథ కార్మికులు రెండు రోజులుగా సమ్మె చేస్తుండడంతో నల్లాల్లో నీరురావడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

జైనూర్, ఆగస్టు 10: జైనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీఐ రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులకు న్యాయం చేస్తామన్నారు. అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా సీఐ రమేష్‌ను సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఉద్దవ్, రాజేష్, దత్త, రాజు తదితరులున్నారు.